
వాసిరెడ్డి సీతాదేవి



# ధర్మాసనం

అది భాగీరథీ తీర ప్రాంతం.

సంధ్యా సమయం!

ఆకాశమంతటా నీలివర్ణం అలుముకుంది. వట వృక్షాల పైనుంచి శాఖలనుంచి కిందకు జారుతున్నాయి. ఆ వృక్షాలు ఎంతో కాలంగా, అక్కడ జరుగుతున్న పాప పుణ్యాలను గమనిస్తున్న మౌన సాక్షుల్లా ఉన్నాయి. ఆ వృక్షాలతో పాటు పూలమొక్కలూ, తీగ జాతులు మొక్కలూ చూస్తే వాటిని ఎంతో శ్రద్ధగా పెంచుతున్నట్టు తెలిసిపోతుంది.

పది దాకా రెల్లుతో కప్పిన కుటీరాలు ఉన్నాయి. ప్రతి కుటీరంపైనా పూలతీగలు అల్లుకొని ఉండటం విశేషం. ఆకుటీరాల మధ్య ప్రత్యేక శ్రద్ధతో కట్టబడిన పెద్ద కుటీరం ఉన్నది. అందులో భైరవానంద స్వాముల నివాసం. ఆ పక్కనే ఉన్న కుటీరం ఆ ఆశ్రమవాసుల అలనా పాలనా చూసే గౌతమి నివాసం.

ప్రార్థన సమయం అయింది. కుటీరాల నుంచి కాషాయ వస్త్రధారులైన ఆశ్రమవాసులు ఒక్కొక్కరే వచ్చి, అక్కడ ఉన్న ఉన్నత ఆసనం ఎదురుగా కూర్చుంటున్నారు. వాతావరణం నిశ్శబ్దంగా, చెట్టు ఆకు రాలినా వినిపించేలా ప్రశాంతంగా ఉన్నది. పాతికమంది పురుషులూ, ఓ పది మంది యువతులూ అక్కడికే వచ్చి కూర్చున్నారు. యువతులంతా ఒకవైపుగా, యువకులంతా ఎదురుగా కూర్చున్నారు. మధ్య వయస్కులు అనవాళ్ళకి ఎదురుగా కూర్చున్నారు. అందులో చాలామంది కళ్ళు మూసుకొని కూర్చున్నారు. అన్ని భాషల వాళ్లూ ఉన్నారు. నలుగురైదుగురు అమెరికన్లు కూడా ఉన్నారు. అందరూ స్వామి వారి రాకకు ఎదురు చూస్తున్నారు.

ఎదురుగా ఉన్న పెద్ద కుటీరం తాలూకు, వట్టివేళ్ళతో తయారు చెయ్యబడిన తలుపు తెరుచుకొన్నది. అందరూ లేచి నిల్చుని రెండు చేతులూ జోడించారు.

భైరవానందుల వారు, పావుకోళ్లు టక టక లయబద్ధంగా శబ్దం చేస్తూ ఉండే విశాలానంగా నవ్వుతూ ముందుకువచ్చారు. వ్యాఘ్ర చర్మం పరిచివున్న ఆసనాన్ని అలంకరించారు. అందర్నీ కూర్చోమని చేతితో సైగ చేశారు. అందరూ కూర్చున్నారు. పిచ్చుక అందంగా కట్టుకొన్న గూడులా, భారీ దిగిన గడ్డాన్ని సవరించుకొంటూ దృక్కుల్ని నలువైపులా సారించారు భైరవానందులు. ఆయన వయసు ఏభై సంవత్సరాలు. కాని ముప్ఫయ్ కంటే ఎక్కువ ఉన్నాయంటే కొత్త వారెవరూ నమ్మరు. మిగల ముగ్గిన బంగినపల్లి మామిడికాయ ఛాయ. ప్రశస్త లలాటం. విశాల నేత్రాలు ఆ నేత్రాలలో ఏదో అద్భుత ఆకర్షణ. నియమబద్ధంగా ఆసనాలు వెయ్యడంవల్ల చక్కగా, దృఢంగా తయారైన నిలువెత్తు విగ్రహంలాంటి శరీర సౌష్టవం.

ఒక శిష్యుడు గంజాయిపొడి దట్టించి గొట్టానికి నిప్పు అంటించి స్వాముల వారికి అందించాడు. మరో శిష్యుడు పక్కన నిలబడి చామరం వీస్తున్నాడు. స్వాముల వారు గంజాయి దమ్ముపట్టి, పొగ వదిలారు. వారి ముఖంలో అంతవరకూ ఉన్న ప్రశాంతత మాయమైంది. ముఖం గంభీరంగా మారింది. ఏదో ఆలోచిస్తూ మళ్ళీ గంజాయి దమ్ము పీల్చారు.


"ఇంకా ఆశాలిక రాలేదు. ఆవిడ వస్తే గాని బోధ ప్రారంభంకాదు." ఒక యువకుడు పక్కవానితో చిన్నగా అన్నాడు.

"ఇష్! మాట్లాడకు!" రెండోవాడు మందలించాడు. ఆ మందలింపులో భయం ఉన్నది.

గౌతమి నివసించే కుటీరం తలుపు ముందుకు జరిగింది. గౌతమి తలవంచుకొని బయటికి వచ్చింది. ఆమె వెనకే ఓ పదిహేడు సంవత్సరాల బాలిక ఎవరో లోపలనుంచి తరుముతున్నట్టు బయటికి వచ్చింది. గౌతమి పేరు మెత్తగా ఉంటుంది. ఆమె రూపం భయంకరంగా ఉంటుంది. ఆమె మాట పెళుసుగా ఉంటుంది. ముఖం బెల్లంకొట్టిన రాయిలా బిగిసిపోయి ఉంటుంది. ఆమె చూపులు గద్దచూపుల్లా ఉంటాయి, ఎప్పుడూ ఆశ్రమవాసుల్లోని తప్పుని వెతికి పట్టుకోవాలన్నట్టుగా, ఐదడుగుల ఏడు అంగుళాల ఎత్తూ, ఎత్తుకు తగ్గ లావూవున్న ఆమెను చూడగానే ఆడో మగో పోల్చుకోవటం కష్టమే. మగవాడిలా గోచిపెట్టి మోకాళ్ళవరకే కట్టిన కాషాయరంగు ధోవతి. భుజాల మీదగా క్రాసులా వచ్చి నడుముకు చుట్టబడిన మరో అంగవస్త్రం. ముడతలుపడి వేలాడుతున్న పొట్టమీదా, మెడమీదా, ఆచ్ఛాదన లేని చేతి దండలకూ పులిమిన రక్తచందనం. ఇదీ ఆమె రూపం. ఆమెకు ఆ ఆశ్రమవాసులు చాటుగా పెట్టుకొన్న ముద్దుపేరు గంగానమ్మ.

గౌతమి ఆ యువతి రెక్కపట్టుకొని తీసుకొస్తున్నది, గువ్వను గండుపిల్లి నోట కరచుకొని వస్తున్నట్టు.

ఆశ్రమవాసులందరూ బిగిసిపోయి కూర్చున్నారు. గౌతమి ఆ యువతిని





స్వాములవారి పాదాలముందు పడేసింది. కీలు ఊడదీసిన బొమ్మలా స్వాములవారి పాదాలముందు కూలబడింది ఆ యువతి.

"స్వామి ఈ పాపిని శిక్షించండి. ఈ పవిత్రమైన ఆశ్రమ వాతావరణాన్ని కలుషితం చేసిన పాపాత్మురాలు" గౌతమి కంఠం నగారామీద దెబ్బపడినట్టుగా మోగింది.

భైరవానందులు కళ్లు మూసుకొన్నారు కళ్లు మూసుకొనే తలపంకించారు — తల పంకిస్తూనే, కళ్లు తెరవకుండానే "ఎన్నో నెల?" నిర్లిప్తంగా పలికారు

"నాలుగు" మళ్ళీ నగారా మోగింది.

"శివ! శివ!" అని ఒక క్షణం కళ్ళముందు చైతన్య రహితంగా కూలబడి ఉన్న యువతిని ఆర్ద్రంగా చూశారు.

"స్వామి! ఇది మహాపాపం చేసింది. క్షమించరాని అపరాధం చేసింది" ఏ సానుభూతికి అర్హురాలు కాదన్నట్టుగా అన్నది గౌతమి. గౌతమి కంఠం మహారణ్యంలో గాలికి వెదుళ్ల చేస్తున్న హోరులా పలికింది.

"మేం చెబుతూనే ఉన్నాం. సామాన్య మానవునికి మాయను జయించడం సులభ సాధ్యం కాదు. అందుకు కఠోర సాధన కావాలి. సాధనద్వారా సుఖదుఃఖాలకు అతీతంగా ఎదగాలి. అప్పుడే పశుప్రాయుడైన మానవుడు ఈ ఐహిక, భవ్య, బంధం నుంచి విముక్తిని సాధిస్తాడు. ఈ శరీరం నవరంధ్రాలతో కూడిన ఒక తోలుతిత్తి...."

"స్వామీ! ఈ పాపాత్మురాలికి దండన విధించండి." గౌతమి మధ్యలో అందుకొన్నది.

"అవునవును! కఠినశిక్ష విధించండి. ఈ ఆశ్రమంలో మరోసారి ఇలా జరక్కుండా...." జనంలోనుంచి కలకలం.

"శాంతించండి. ఈ పాపకార్యంలో నీ భాగస్వామి ఎవరు బాలా!" భైరవానంద స్వామి యువతిని అడిగాడు.

ఆమె ఉలక లేదు. పలక లేదు.

"స్వామీ! ఇది చాలా గడుసు పిండం. వాతలు పెట్టినా చెప్పడం లేదు." అన్నది గౌతమి.

"మాకు వదిలెయ్యండి. మేం చెప్పిస్తాం!" శిష్యులు కొందరు ఉద్రేకంగా అరిచారు.

"శాంతించండి మీరు చెప్పిస్తారు. ఏదో చెబుతుంది. నిజం చెబుతుందని నమ్మకం ఏమిటి? మీలో ఒకరి పేరు చెప్పవచ్చు. లేక నా పేరే......"

ఓ పక్కగా ఉన్న వటవృక్ష ఛాయలో ఒక యువజంట నిలబడి ఉండటాన్ని ఎవరూ గమనించలేదు. ఆ యువతి భుజంమీద ఓ పసిబిడ్డ నిద్రపోతున్నది. యువకుడు రెండడుగులు ముందుకు వేశాడు. యువతి అతని చెయ్యి పట్టుకొని "శివా ఆగు! తొందర పడకు. పూర్తిగా చూడు. ముందు నేను వెళతాను. ఆ తర్వాతే నువ్వురావాలి" అంటూ వారించింది.

ఆ యువతి పేరు అరుంధతి. శివరావు ఆమె భర్త. "అయితే కూర్చుందాం." అంటూ శివరావు చెట్టుమొదట్లో కూర్చు

న్నాడు. అరుంధతి కూడా కూర్చుంది, నిద్రపోతున్న పిల్లను ఒళ్ళో పడుకో బెట్టుకొని.

"రంతు నేర్చిన స్త్రీ..." భైరవానందుల కంఠం జంగున షిసిపించింది.

మరు క్షణంలో అరుంధతి గతంలోకి జారిపోయింది తనే.... అతని కళ్ళముందున్నది తనే.... ఆ మాటలు తననే అంటున్నాడు....

సరిగ్గా పదిహేను నెలల క్రితం.... ఇదే ఆశ్రమంలో, గౌతమి అరుంధతిని లాక్కొచ్చి స్వాములవారి పాదాలముందు పడేసింది. అరుంధతి దెబ్బతిని లేవలేక, దగ్గరకు వచ్చి తననే చూస్తున్న వేటగాడికేసి చూసిన లేడిలా స్వాములవారిని చూసింది. ఏదో కుళ్ళి కంపుకొడుతున్న పదార్థంతో నిండి వున్న భాండాన్ని ఎవరో ఎదురుగా పగల గొట్టినట్టుగా ముఖం పెట్టారు స్వాములవారు. అరుంధతి రెండు చేతులూ జోడించింది. ఆ చేతుల మీద వాతలు కన్పిస్తున్నాయి.

"స్వామీ ఇది పాపం చేసింది. ఈ పవిత్రమైన ఆశ్రమాన్ని కలుషితం చేసింది. దీనికి శిక్ష విధించండి." గౌతమి కంఠం నగారామీద దెబ్బకొట్టినట్టుగా మోగింది.

"ఎన్నో నెల?" స్వామి

"మూడు!"

"ఎవడా పాపి? వాడిని కూడా దండించాలి!" ఆశ్రమవాసులు ఉద్రేకంతో అరుస్తున్నారు.

"శాంతించండి నాయనలారా! స్త్రీ శరీరమే ఒక పాపకూపం. అది కాముడికి నివాసం ఆమె కళ్ళల్లో విషం ఉన్నది. మాదక పదార్థం ఉన్నది. స్త్రీ అమాయకుడైన పురుషుడ్ని మొదటి రెండు పదార్థాలతోనే ఆకర్షిస్తుంది. ఈ రెంటినీ వెనక్కి నెట్టి అమృతాన్ని మాత్రమే పంచగల స్త్రీలు కూడా ఉంటారు. వారు ఆ దశకు రావడానికి ఆత్మ సాక్షాత్కారం కావాలి. సాధన కావాలి. అందుకే నేను స్త్రీలకుకూడా నా ఆశ్రమంలో స్థానం కల్పించాను. యమకూపంలాంటి వారి శరీరాలను పవిత్ర గంగా జలాల ప్రక్షాళనంచేసి, మాయచేత కప్పబడిన వారి ఆత్మలకు విముక్తి కలిగించాలనుకున్నాను. పేరు అరుంధతి."

"స్వామీ!" గౌతమి కంఠంలో అసహనాన్ని గుర్తించారు స్వాములవారు.

"నిజం చెప్పు! ఎవడు వాడు?" గౌతమి అరుంధతి జుట్టు పట్టుకొన్నది — అరుంధతి నోరు విప్పలేదు

"నాకు వదిలెయ్యండి. నేను చెప్పిస్తాను" ఒక యువసన్యాసి దూసుకొని వచ్చి ఉద్రేకంగా అన్నాడు.

భైరవానందుల వారికి చామరంతో వీస్తున్నా యువకుడి చేతినుంచి అది జారి క్రింద పడింది. అందరూ అతనికేసి చూశారు. అతనంటే స్వామికి ప్రత్యేకమైన అభిమానం. ఆ ఆశ్రమవాసుల్లో చాలా మందికి అతనంటే ఈర్ష్య.

"వాడే పాపి! కొట్టండి! చంపండి!" కలకలం బయలుదేరింది. కొందరు అతని మీదకు దూకారు.

స్వాములవారు అతని ముఖంలోకి లోతుగా చూశారు.

"అవును! వీడే పాపి!" నగారా మొగింది.

"గౌతమీ! తొందరపడకు! శివా ఏమిటిది?" శివానందం వైపుకుతిరిగి అడిగారు స్వాములవారు.

శివానందం ఎవరికేసీ చూడలేదు. పంగి నేలమీద అపరాధిలా తలవంచుకొని కూర్చుని ఉన్న అరుంధతి చెయ్యి పట్టుకొని లేపి నిల్చోబెట్టాడు

"గురుదేవ్! వాడి సాహసం చూడండి!"

"ఇద్దర్నీ శిక్షించండి!" కేకలు వేస్తున్నారు ఆశ్రమవాసులు — స్త్రీ సన్యాసినులు మాత్రం కళ్ళప్పగించి చూస్తున్నారు.

"అవును! నేనే పాపిని! ఆమె తప్పులేదు నన్ను శిక్షించండి" శివానందం మాట పూర్తి అయీకాకుండానే ఓ రాయి వచ్చి నుదురుకు తాకింది. నుదురు చిట్లి రక్తం కారుతోంది.

"కాదు! కాదు! నువ్వు కాదు! నువ్వు పాపం చెయ్యలేదు." మొదటిసారిగా గొంతు విప్పి అరిచింది అరుంధతి

"శివానందా! ఏమిటి నాయనా ఇది? నువ్వు పాపం చెయ్యవు! నాకు తెలుసు."

"గురుదేవ్! అతనే అంగీకరిస్తున్నాడు" గౌతమి కంఠం ఖంగుమన్నది.

"గౌతమి! ఆగు! నువ్వు నీ గురుదేవుని జ్ఞానాన్నే శంకిస్తున్నావు." తీవ్రంగా పలికింది భైరవానందుని కంఠం.

"అయితే అసలు పాపి ఎవరు? ఎవరో చెప్పమనండి గురుదేవ్?" శిష్యుల కేకలు.

"నాయనలారా శాంతించండి, ఇలాంటి విషయాల్లో స్త్రీలు నిజం చెప్పలేరను కోవడం భ్రమ ఆమెకు మీలో ఎవరిమీదైనా కోపం వుంటే, మీలో వారి పేరే చెప్పొచ్చును. ఒక నిరపరాధిని దండించడం మహాపాపం! మరి బలవంతం చేస్తే, ఈ నాగిని నాపేరు కూడా చెప్పవచ్చును."

"శివ శివా! మీ పేరు చెబుతుందా ముక్కలు ముక్కలుగా నరికి పారేస్తాం!" అనేక కంఠాలు అరిచాయి...

"ఇలాంటి విషయాల్లో పురుషుడు నామమాత్రంగానే ఉంటాడు. అపరాధం స్త్రీదే! స్త్రీని దండించాలి"

"భైరవానందం! నీ అసలు రూపం ఈ రోజు నాకు తెలిసింది. ఆ అమాయకురాలి ముఖంలోకి చూడు — సరిగ్గా చూసి చెప్పు. ఆమె పాపం చెయ్యగలదా?" శివానందం కంఠం గుడిగంటలా మోగింది.

"నోరు ముయ్! గురుదేవుడ్ని ఏకవచనంతో పిలుస్తావా? సర్వ సంగ పరిత్యాగుల్నే నిందిస్తావా?" గౌతమి అరిచింది.

"తన్నండి! చంపండి!" మరో రాయి వచ్చి శివానందం వీపుకు తగిలింది. నుదురు నుంచి కారుతున్న రక్తం గుండెలమీద పడి కాయరంగు జుబ్బాను తడుపుతున్నది.

"ఆగండి! ఎవరా రాళ్లు విసురుతున్నది న్యాయ విచారణ చెయ్యవలసింది మేము," అంటూ శివానందం వైపుకు తిరిగి "నాయనా శివా! ఎందుకు అంత ఉద్రేకం? ఈమె నీకు అమాయకురాలిలా కన్పిస్తున్నదా? ఆమె అంగాంగాలతో బుసలు కొడుతున్న నాగిని నీకు కన్పించడం లేదా? లేదు నీకు చవు. ఇంకా నీ ఆత్మను రాగ మాయ కప్పేసే ఉన్నది. ఆ మాయ వల్లనే నీ కళ్ళకు సత్యం కన్పించడం లేదు." అన్నారు గురుదేవులు

శివానందం గురుదేవుని ముఖంలోకి చూస్తూ విరసాగ్రంగా నవ్వాడు

"ఏమే నాగిని! ఏమిటి ఆలోచిస్తున్నావ్ నువ్వు కల్పించిన ఈ పాపకూపంలోకి ఎవర్ని లాగాలనేనా?" గురుదేవులు అరుంధతిని చూస్తూ ప్రశ్నించారు.

"గురుదేవ్, ఒక పాపితో ఇంత సేపు మీలాంటి సర్వసంగ పరిత్యాగులు చర్చించడానికి శాస్త్రాలు అంగీకరిస్తాయా?" గౌతమి శిష్యుల్ని చూస్తూ అన్నది

"అవును స్వామీ! త్వరగా న్యాయ నిర్ణయం చెయ్యండి" అనేక కంఠాలలో అసహనం.

"చూడు నాగిని! నీకు మృత్యుదండన విధిస్తున్నాను"

గౌతమి ముఖం వికసించింది ..

"ఎలా? ఉరితీసా— నీళ్ళలో ముంచా- లేక అగ్నికి.... శిష్యుల నుంచి అనేక ప్రశ్నల వర్షం.

"కాదు, రాళ్ళతో కొట్టి" భైరవానందుల కంఠం నిబ్బరంగా, గంభీరంగా పలికింది.

అందరూ లేచారు. "లేవండి ఇంకా చూస్తున్నారేం? రాళ్లు తీసుకోండి."

"ఆగండి!" గురుదేవుని ఆజ్ఞ, అందరూ ఆగారు. గౌతమి కనుబొమ్మలు ముడిపడ్డాయి.

"మృత్యుదండన ఈ పాపికి విధించారు. కాని ఆమె గర్భంలో ఓ ప్రాణి జీవం పోసుకుంటున్నది. ఈమెను చంపితే, మరో నిరపరాధి కూడా చస్తుంది"

అందరూ భైరవానందుని ముఖంలోకి చూస్తూ నిలబడ్డారు

"ఇంతకూ మమ్మల్ని ఏం చెయ్యమంటారు గురుదేవా?"

"ఆమెను హింసించకండి. ఆశ్రమం నుంచి ఈ క్షణమే వెళ్ళగొట్టండి. ఆమె నీడ కూడా ఈ ఆశ్రమ పరిసరాల్లో పడకూడదు." అనేసి, భైరవానందులు లేచారు పావుకోళ్ళు టకటక లాడిస్తూ తన కుటీరంకేసి నడిచారు. గౌతమి అతన్ని అనుసరించింది.

స్వామివారికి ఏకాంత పూజకు సమయం అయిందని శిష్యులకు తెలుసు

"ఇంకా నిల్చున్నావేం? వెళ్ళు!" అనేక కంఠాలు అరిచాయి.

ఆమె చెయ్యి పట్టుకొని శివానందం ఆశ్రమం నుంచి తీసుకెళ్తుంటే, ఆశ్రమవాసులు విస్తుపోయి చూస్తూ నిల్చున్నారు.

"అయ్యో ఏమిటి ఆలోచిస్తున్నావ్? లే! ఆమెను మనం వెంటనే రక్షించాలి" అంటూ శివరావు లేచి నిల్చున్నాడు.

"పద! దీన్ని తీసుకో!" అంటూ పిల్లను అందించింది శివరావుకు అరుంధతి.

"పది కొరడా దెబ్బలు... ఆశ్రమ బహిష్కరణ...." భైరవానందం కంఠం విన్పించింది.

'కెవ్వు' మని అరుపు-

"ఆగండి!" స్త్రీ కంఠం దిక్కులు పిక్కటిల్లేలా మోగింది

అందరూ తిరిగిచూశారు

అరుంధతి గౌతమి చేతిలో కొరడా లాగేసింది.

"శివానందం.... అరుంధతి.... గురుదేవ్... ఈ పాపులు మళ్ళీ వచ్చారు." అనే కంఠాలు

అరుంధతి వంగి యువతిని లేవదీసింది.

"గురుదేవ్! ఈ పాపులు మీ ఆజ్ఞను ధిక్కరించారు" అరిచింది గౌతమి.

"చంపండి! రాళ్లతో కొట్టండి!"

"ఆగండి! ఏమిటి శివానందం ఇది?" భైరవానందులు అడిగారు.

'శివానందం కాదు, శివరావు' అన్నాడు శివరావు.

"చెప్పమ్మా! ఎవడా దుర్మార్గుడు. నీకు భయం లేదు. వాడెవడో నాకు తెలుసు కాని నీ నోటినుంచి చెప్పు! అందరికీ విన్పించేలా అరిచి చెప్పు!" ఉద్రేకంతో ఊగిపోతూ శివరావు కొయ్యబొమ్మలా నిలబడి ఉన్న ఆ యువతిని అడిగాడు


"సీతా! నువ్వు మాట్లాడు. రామ్మా వెళ్దాం!" అంటూ ఆ యువతిని పొదివిపట్టుకొని ముందుకు నడిచింది అరుంధతి- శివరావు ఆమెను మౌనంగా అనుసరించాడు. గందరగోళం చూసి శివరావు భుజంమీద ఉన్న పసిబిడ్డ ఏడవసాగింది.

భైరవానందులు గద్దె దిగారు.

ముందుకు నడిచారు.

అందరూ చూస్తున్నారు

"ఆగు అరుంధతీ!" అన్నాడు గురు



దేవుడు..

అరుంధతి ఆగింది. అలా పిలవడం ఆమెకూ, అక్కడ ఉన్న అందరికీ ఆశ్చర్యాన్ని కలిగించింది.

భైరవానందులు ఒకసారిగా వంగి అరుంధతి పాదాలకు నమస్కరించాడు.

ఆశ్రమవాసులు చేష్టలుడిగి, వృక్షాల మధ్య, శిలాప్రతిమల్లా నిలబడిపోయారు.

అరుంధతి గబుక్కున వెనక్కు తగ్గింది.

"నన్ను క్షమించు శివా?" శివరావు కాళ్ళ మీదకు వంగబోతున్న భైరవానందుల్ని కుడిచెయ్యి అడ్డంపెట్టి వారించాడు శివరావు.

"స్వామీ!" గద్గద కంఠంతో అన్నాడు శివరావు.

"ఇంకా నన్ను స్వామిఅని పిలుస్తున్నావా శివా?"

"గురుదేవా ఏమిటిది? సర్వసంగ పరిత్యాగులు పుణ్యమూర్తులు, మీరా, మీరు ఒక వ్యభిచారిణి పాదాలకు నమస్కరించడమా? పాపుల పాదాలు తాకడమా!" గౌతమి తేరుకొని అన్నది. ఎండిపోయిన వెదురులా పలికింది ఆమె కంఠం.

"నేను పాపిని! ఆమెకాదు. ఆమె పాపం చెయ్యలేదు. ఇప్పుడు ఈ కమలకు కూడా నేనే ద్రోహం చేశాను. ఆ పాపిని నేనే! నన్ను దండించండి" భైరవానందులు ఉద్రేకంగా మళ్ళీ మళ్ళీ అవే మాటల్ని వల్లిస్తున్నారు.

"ఏమిటలా చూస్తారు? గురుదేవులకు మతి చలించింది. లోపలకు తీసుకెళ్ళండి." నగారామీద దెబ్బ పడినట్టు గౌతమి కంఠం మోగింది.

శిష్యులు ముందుకు వచ్చారు.

"ఆగండి" అన్నారు భైరవానందులు

"పాపం చేసింది ఎవరో ఈ నరరూప రాక్షసికి కూడా తెలుసు. నేనే పాపిని. నేను వెళ్ళిపోతున్నా. శివా నేను నీతో వస్తాను."

అరుంధతి, శివరావు కింకర్తవ్యవిమూఢులై నిల్చున్నారు.

"చూస్తారేం! గురుదేవులకు పిచ్చెక్కింది ఆశ్రమ ప్రతిష్ఠ మంటలో కలవబోతున్నది. లోపలకు తీసు కెళ్ళండి." గౌతమి అరిచింది.

ఒక్కసారిగా అనేక మంది ఆశ్రమవాసులు భైరవానందాన్ని చుట్టు ముట్టారు. ఆతని మాటలు వినిపించుకోకుండా లోపలకు లాక్కెళ్ళారు.

అరుంధతి శివరావు ముఖంలోకి చూసింది

"ఇంత మంచిని మనం ఎదిరించలేం. పద వెళ్దాం! రామ్మా కమలా"

కమలను తీసుకొని అరుంధతి, శివరావులు వెళ్ళిపోయారు

మూడు రోజుల తర్వాత.

"అరూ! అరూ! కమలా!" శివరావు కేకలు పెట్టాడు.

"ఏమిట[illegible]మండీ?" ఇద్దరూ వంటింట్లో నుంచి బయటికి వచ్చారు

"ఈ వార్త చూడండి." పేపరు అందించాడు శివరావు

అరుంధతి పేపరు అందుకొన్నది. వార్త పైకే చదివింది.

"భాగీరథాశ్రమ ధర్మ గురువులైన భైరవానందుల వారికి మతి చలించింది. ఆయనను పిచ్చాసుపత్రిలో చేర్పించారు. ఇప్పుడు గౌతమీ మాత ఆశ్రమ పెద్దగా, ఆశ్రమ నిర్వహణ బాధ్యతను చేపట్టారు."

ముగ్గురూ మౌనంగా ఎవరి ఆలోచనల్లో వాళ్ళు ఉండి పోయారు.●

With Best Compliments

SREE LAKSHMI ENTERPRISES
BLOCK MAKERS
MUSEUM ROAD, VIJAYAWADA-520 002
PHONE : 77869